క్లుప్తంగా

శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించండి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మాల కులస్తులకు శ్మశానవాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని మాల సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. జాతీయ రహదారి–బీబీ161 వెడల్పులో భాగంగా ఆనుకొని ఉన్న శ్మశానవాటిక స్థలం పోయిందన్నారు. కాలనీ సమీపంలో ప్రభుత్వ భూమిని కేటాయించి సమస్య పరిష్కరించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ గంగారాం, శ్రీనివాస్, శివలింగ్, రాహుల్ ఉన్నారు.

విద్యార్థుల కోసం బస్సులు ఆపండి



రుద్రూర్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల హైస్కూళ్ల సమీపంలో ఉదయం, సాయంత్రం బస్సులను నిలిపి విద్యార్థులకు సహకరించాలని స్వచ్ఛంద సంస్థ రైడ్ సభ్యులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం రైడ్స్ అధ్యక్షుడు కర్రోళ్ల కృష్ణ ఆధ్వర్యంలో బోధన్ డిపో మేనేజర్ విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగడి బజార్ సమీపంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ కూడా ఉంది. ఈ స్కూళ్లకు జవహర్‌నగర్, రాజీవ్ నగర్ కాలనీలతో పాటు సులేమాన్‌నగర్, రాణంపల్లి, చిక్కడపల్లి, అక్బర్‌నగర్ గ్రామాల నుంచి విద్యార్థులు బస్సు ఎక్కుతారు. ప్రయాణికులు అధికంగా ఉన్నప్పుడు కొందరు కండక్టర్లు ఇక్కడ ఉన్న విద్యార్థులను ఎక్కించుకోవడం లేదు. దీని వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రైడ్స్ సభ్యులు మోహన్, శివకుమార్, మహిపాల్, అశోక్, ప్రకాష్, బాలరాజ్, వెంకటేశం, శంకర్, రాములు తదితరులున్నారు.

తడి పొడి చెత్త వేర్వేరుగా వేయాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు తడి పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. పట్టణంలోని 20, 24వ వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ బ్యాగులను, చెత్తను మురికి కాలువలో వెయ్యవద్దన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సానిటరీ ఎస్సై గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు హేమంత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు



వేల్పూర్: పీఎం నరేంద్రమోదీ పరిపాలన 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రామన్నపేట్‌లో సోమవారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్కన్నగారి మోహన్, బేల్దారి నవీన్, భానుచందర్, లింగన్న పాల్గొన్నారు.

సొసైటీల్లో సన్నరకం విత్తనం వడ్లు

బాల్కొండ: ఖరీఫ్‌లో సాగు చేయటానికి సొసైటీలకు సన్నరకం వరి విత్తనాలను ప్రభుత్వ సరఫరా చేసింది. సహకార సంఘాల్లో కేఎన్ఎం1638(25) కేజీల బస్తా రూ.1,075, ఆర్ఎన్ఆర్15048(25) కేజీల బస్తా రూ 1,075, బీపీటీ 5204 (25) కేజీల బస్తా రూ.1,020 ధర ఉందన్నారు. రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

'రైతు భరోసా' అందించాలి

నందిపేట్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలలో భాగంగా రైతాంగానికి పెట్టుబడి ఖర్చుల నిమిత్తం రైతు భరోసాని అందించాలని అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు గంగాధర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ.12 వేలు అందించాలన్నారు. నాయకులు రాజలింగం, లక్ష్మన్న, పుష్ప, గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

బాల్కొండ: సామాజిక న్యాయమంటూ చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మైనారిటీలకు మంత్రి వర్గంలో ఎందుకు చోటు కల్పించలేదని బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎంఏ షాహిద్ సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో మైనార్టీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించడంతో పాటు సముచిత శాఖలను కేటాయించారన్నారు. మైనార్టీలను మంత్రి వర్గంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రారంభానికి నోచుకోని భవనం

- పదేళ్ల కిందట పూర్తయిన ఇరిగేషన్ శాఖ విశ్రాంతి భవన నిర్మాణం
- భవనంపై మొలిచిన పిచ్చి మొక్కలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



నవీపేటలోని ఇరిగేషన్ శాఖ విశ్రాంతి భవనం

నవీపేట: మండల కేంద్రంలో పదేళ్ల కిందట రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఇరిగేషన్ విశ్రాంతి భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల పక్కన నిర్మించిన భవనంపై పాలకులు, అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు భూములకు సాగునీరందించే ప్రధాన, ఉప కాలువల ఆధునీకీకరణ సమయంలో నిర్మాణాన్ని పూర్తి చేశారు. తాళాలు తెరవకపోవడంతో కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. ప్రారంభానికి ముందే అక్కడక్కడ పాక్షికంగా పగుళ్లు ఏర్పడ్డాయి. రెండు ప్రభుత్వాలు మారినా విశ్రాంతి భవనానికి మోక్షం లభించడం లేదు. లోపల భాగంలో కరెంట్ కనెక్షన్ లేకపోవడంతో ఇంకా ప్రారంభించడం లేదని అధికారులు పొంతనలేని సమాధానాలిస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించినా అధికారులు వేలల్లో ఖర్చు చేస్తే కరెంట్ కనెక్షన్ ఇవ్వలేరా? అని స్థానికులు అంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

విశ్రాంతి భవన నిర్మాణం పూర్తయింది. కానీ కరెంట్ వైరింగ్, కనెక్షన్ తదితర చిన్న చిన్న పనులు మిగిలిపోయాయి. మంజూరైన నిధులు నిర్మాణానికి సరిపోయాయి. అదనంగా మరికొన్ని నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే కరెంట్ సదుపాయం కల్పించి ప్రారంభిస్తాం.
– బలరామ్, ఇరిగేషన్ ఈఈ, నవీపేట

నేటి చిత్రం



వంతెనపైకి చెట్ల కొమ్మలు

బోధన్: బోధన్ పట్టణ కేంద్రం నుంచి శ్రీనివాస్ నగర్ మీదుగా కల్దుర్కి వైపు వెళ్లే ప్రధాన మార్గంలో పెద్దమావంది గ్రామ శివారులో గల పసుపు వాగువంతెనపైకి ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు వచ్చి వేలాడుతున్నాయి. చెట్ల కొమ్మలు వచ్చి పోయే వారికి తగులుతున్నాయి. రాత్రివేళ అయితే వాహనదారులకు కొమ్మలు కనిపించడంలేదు. ఈ వంతెన పట్టణ కేంద్రానికి వచ్చేందుకు 10 గ్రామాల ప్రజలకు ప్రధాన వారధిగా ఉంది. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలి. – బి.ముత్తెన్న, పెద్దమావంది

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

ఎన్నికల హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి



కోటగిరిలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

రుద్రూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోటగిరి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కోటగిరి మండల అధ్యక్షుడు ఎముల నవీన్ మాట్లాడుతూ.. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ వరంగల్‌లో రైతు డిక్లరేషన్‌ను చేసి మరిచి పోయిందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రైతు రుణమాఫీ, భూమిలేని ఉపాధి కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. హామీలను నెరవేర్చలేని పక్షంలో సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు హవగిరిరావు దేశాయ్, మహిళా నాయకురాలు శ్యామల, మండల ప్రధాన కార్యదర్శి విలాస్, శ్యామ్, మామిడి శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ జమ చేయాలి



రుద్రూర్/పోతంగల్: ధాన్యం బోనస్ డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని పోతంగల్ మండల బీజేపీ అధ్యక్షుడు బజరంగ్ హన్మాండ్లు డిమాండ్ చేశారు. పోతంగల్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సోమవారం బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున పంట పెట్టుబడికి రైతు భరోసా డబ్బులు ఇవ్వాలని కోరారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మక్కయ్య, మండల నాయకులు గంధం మోహన్, బండారి గంగారాం, నాగభూషణం, శంకర్, నాగనాథ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడండి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త సౌందర్య

పెర్కిట్(ఆర్మూర్): రైతులు నేల తల్లి ఆరోగ్యానికి హానికరమైన రసాయన పురుగు మందులు, ఎరువులను మోతాదుకు మించి వినియోగించవద్దని రుద్రూరు ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్త సౌందర్య సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి ఆమె మాట్లాడారు. భూసార పరీక్ష ఫలితాలకనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలన్నారు. భాస్వరం ఎరువులను దుక్కిలో మాత్రమే వేసుకోవాలని సూచించారు. అలాగే పంట మార్పిడి విధానం పాటించాలన్నారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకట్ రెడ్డి, ఏవో రాంబాబు, ఏఈవోలు రమ్య, వసుధాం, వెటర్నరీ డాక్టర్ సందీప్ రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్‌ను వేరే చోటుకు తరలించాలి



కమ్మర్‌పల్లి: ఉప్లూర్‌లో జనావాసాల మధ్య ఉన్న రైస్‌మిల్‌ను వేరే చోటుకు తరలించాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం ఈమేరకు పోతు గణేష్, తక్కూరి దేవ భీమన్న, జిందం రమేష్, తక్కూరి హన్మాండ్లు, పోతు శంతన్ తదితరులు ప్రజావాణిలో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన హజారి కృష్ణ అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా జనవాసాల మధ్య రెండు టన్నుల సామర్థ్యం గల రైస్‌మిల్‌ను అనుమతులు లేకుండా నడుపుతున్నారని, దాని ద్వారా వచ్చే దుమ్మూధూళి వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని పేర్కొన్నారు. ఈ విషయమై స్థానిక జీపీ కార్యదర్శి, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని వివరించారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



రుద్రూర్‌లో బడి బాట నిర్వహిస్తున్న రైడ్స్ సభ్యులు



పెర్కిట్‌లో.. ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవోలు, ఉపాధ్యాయులు చెబుతున్నారు. బోధన్, బాన్సువాడ, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఇంటింటికి తిరిగి సూచించారు. బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్‌లో ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని వీడీసీ సభ్యులు తీర్మానం చేసి సోమవారం ఎంఈవో బట్టు రాజేశ్వర్‌కు అందజేశారు. అలాగే రుద్రూర్‌లో రైడ్స్ సభ్యులు స్థానిక ఎంఈవో శ్రీనివాస్‌తో కలిసి బడి బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. – రుద్రూర్/పెర్కిట్/బాల్కొండ/వేల్పూర్



మెండోరా మండలం బుస్సాపూర్‌లో..



పడగల్‌లో ..

సభలను జయప్రదం చేయాలి



వర్ని: ఈ నెల 21, 22 తేదీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరుగబోయే టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ కోరారు. సోమవారం మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లో మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. 21న జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి పాత కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని, 22న ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పోతంగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని హైస్కూల్ 1997–98 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సోమవారం స్థానిక సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కార్యక్రమానికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. నాటి తీపి, చేదు ఘటనలు గుర్తు తెచ్చుకున్నారు. యోగ క్షేమాలు తెలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు.

విద్యార్థిని అదృశ్యం

బాల్కొండ: మండలంలోని కిసానగర్‌కు చెందిన ఇషా పంకజ్ పటేల్(20) అనే డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ఇషా పంకజ్ ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్ర కుమార్

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ సూచించారు. నారాయణ్‌పూర్‌లో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని సూచించారు. తహశీల్దార్ వెంకట రమణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే నిర్వహించాలి

వేల్పూర్: పచ్చలనడ్కుడ, జాన్కంపేట్ గ్రామాలలో సోమవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో 41 మంది రైతులు తమ భూముల సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో భూమి ఉంటే రికార్డుల్లో ఉండడం లేదని, రికార్డులో ఉంటే క్షేత్రస్థాయిలో ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికంగా ఇవే సమస్యలు ఉన్నందున భూముల రీసర్వే ఒక్కటే పరిష్కారమార్గమని పేర్కొన్నారు. జాన్కంపేట్‌లో తహసీల్దార్ శ్రీనివాస్, పచ్చలనడ్కుడలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్ స్వాతి, ఆర్ఐ గోపాల్ పాల్గొన్నారు.

దివ్యాంగుల బడిబాట



పేర్లు నమోదు చేసుకుంటున్న సంస్థ ప్రతినిధులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో సోమవారం స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం సంస్థ కార్యదర్శి సిద్దయ్య మాట్లాడారు. 18 ఏళ్ల లోపు గల మానసిక వికలాంగులు, అంధులు, చదువు మానేసిన వారిని పాఠశాలల్లో చేర్పడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని, దివ్యాంగులకు ఉచితంగా చదువునేర్పుతూ, వారికి కావాల్సి ఉపకరణాలను అందిస్తామని తెలిపారు. స్నేహ సొసైటీ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఆసియా బేగం, రాధిక ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



ఖుద్వాన్‌పూర్‌లో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నందిపేట్(ఆర్మూర్): ఖుద్వాన్‌పూర్‌లో సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామ సెక్రెటరీ నరేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తుక్కన్న, ఎర్రక్క, గంగామణి, సాయన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 15వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ భూమి పూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు జిమ్మి రవి, ప్రసాద్, భూపేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ మందిర నిర్మాణానికి ..

నందిపేట్(ఆర్మూర్): వన్నెల్(కే) గ్రామంలో సోమవారం హనుమాన్ మందిరం నిర్మాణానికి నందిపేట శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు బొట్టు పెట్టి ఆశీర్వదించారు.

ప్రమాదకరంగా బావి



పోచంపాడ్‌లో వీఐపీ పుష్కర ఘాట్ వద్ద రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న బావి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గోదావరి వీఐపీ పుష్కరఘాట్ వద్ద బావి ప్రమాదకరంగా ఉంది. దీంతో భక్తులు బావిని పూడ్చాలని కొన్నేళ్లుగా కోరుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రాజెక్ట్ కాలనీ నిర్మాణ కాలంలో నీటి సరఫరా కోసం గోదావరి వద్ద బావిని తవ్వారు. ఆ బావి నుంచి పోచంపాడ్‌లోని కోదండరామాలయం, శివాలయం భూముల్లో సాగు చేసే పంటలకు సైతం నీరు అందించే వారు. కానీ ప్రస్తుతం ఆ బావి పాడుబడి, చెత్తతో నిండిపోయింది. చిన్నారులు అందులో పడిపోయే ప్రమాదం ఉన్నందున అధికారులు స్పందించి బావిని పూడ్చివేయాలని భక్తులు కోరుతున్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3	శ్రీశ్రీశ్రీ రాజావారు-11.45 హౌస్‌ఫుల్-5 (హిందీ)- 2.55, 6.30, 10.00
స్క్రీన్-4	థగ్‌లైఫ్-11.35, 3.00,6.30, 10.00

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,500	వెండి(కిలో)	1,03,500
22 క్యారెట్స్	90,002		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

దోమల నివారణకు చర్యలు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ఎస్సీ వసతి గృహంలో సోమవారం వైద్య ఆరోగ్య సిబ్బంది దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. త్వరలో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. డాక్టర్లు ప్రవీణ్, సుభాకర్, పీహెచ్ఎన్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి, వేంపల్లిలో.. బాల్కొండ మండలం నాగాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు 8 మంది విద్యార్థుల ఎంపిక



బోధన్: సాలూర పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ ఎంపిక పోటీ పరీక్షలో ప్రతిభ చాటారు. గత ఏడాది నవంబర్ నెలలో నిర్వహించిన పరీక్షకు పాఠశాల నుంచి 12 మంది హాజరుకాగా, 8 మంది విద్యార్థులు స్కాలర్ షిప్ పొందేందుకు ఎంపికయ్యారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగు సంవత్సరాలు నెలకు రూ.1,200 చొప్పున రూ.48 వేలు అందనున్నాయి. విద్యార్థులను ఎంఈవో రాజీ మంజూష, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వర్ని గంగాలక్ష్మి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు.

ఇద్దరు మోతె విద్యార్థినులు..



రక్షిత



మనశ్వితా

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ముద్దుల రక్షిత, మూడ్ మనశ్విత ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం గణేష్ సోమవారం తెలిపారు. విద్యార్థినులను హెచ్ఎం అభినందించారు. పీఆర్‌టీయూ నేత సీవీ నర్సింహారావు, ఉపాధ్యాయులు గణేష్, మహేందర్, రత్నయ్య, సురేష్ పాల్గొన్నారు.

నేడు డొంకేశ్వర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 9 గంటలకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో మధుసూదన్ తెలిపారు. పంటల సాగు, యూరియా వాడకం, పంటల మార్పిడి, తదితర అంశాలపై సూచనలు చేస్తారన్నారు.